ప్రజాశక్తి

గురువారం 12 డిసెంబర్ 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

రైతుకు నెలకు రూ.800

- ఇంటిల్లిపాది కష్టానికి దక్కే ఫలితం అతిస్వల్పం
- అన్నీ అనుకూలించినా ఆదాయం అంతంత మాత్రమే
- ఇప్పుడిప్పుడే చేతికొస్తున్న వరిపంట
- ఎకరాకు 32-35 బస్తాల దిగుబడి అంచనా

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఖరీఫ్‌లో ముందస్తుగా సాగైన వరి పంట ఇప్పుడిప్పుడే చేతికొస్తోంది. ఈపూరు ప్రాంతంలో అధికారులు పంట కోత ప్రయోగం చేపట్టగా ఎకరాకు సగటున 32 నుండి 35 బస్తాల (బస్తా 75 కిలోలు) వరకు దిగుబడి రావచ్చని అంచనాకు వచ్చారు. దీన్ని క్వింటాళ్లలో లెక్కిస్తే 24-26 వరకు ఉంటుంది. క్వింటాళ్ ధాన్యం 'ఎ' గ్రేడ్ అయితే రూ.2320, సాధారణ రకమైతే రూ.2300గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని ప్రకటించినా ప్రస్తుతానికి అవి ప్రారంభం కాలేదు.

పల్నాడు జిల్లాలో ఏడు లక్షలకుపైగా సాగు భూమి ఉండగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 86,500 ఎకరాల వరకూ వరి సాగైంది. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే కోత దశకు చేరుకోగా, మరికొన్ని పొలాలు కంకిదశలో ఉన్నాయి. మరో 20 రోజుల్లో ఈ పంట కూడా చేతికొస్తుంది. ఇటీవల తుపాను ప్రభావంతో కొంతపైరు నేలవాలగా వాటన్నింటినీ పైకిలేపి కట్టలు కట్టిస్తున్నారు. ఇందుకుగాను ▶ 2లో

ఎకరా వరిసాగుకు అయ్యే ఖర్చులు (రూ.లలో)

దుక్కి	1600
దమ్ము	3000
నారు పెంపకం	3000
నాట్లు రూ.	3000
కలుపు తీత	3000
ఎరువులు రూ.	10000
పురుగు మందులు	6000
కూలి ఖర్చులు	4000
నూర్పిడి	3000
సంచులు	1500
ధాన్యం రవాణా	1900
మొత్తం	40000

వీటికి కౌలు అదనం

నిరసనలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

కేరళ ప్రభుత్వంపై కేంద్రం కక్షసాధింపు

గుంటూరులో రైతు, కార్మిక ప్రజా సంఘాల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

దేశంలోనే ఆదర్శవంతమైన పరిపాలన అందిస్తూ, అభివృద్ధి పథంలో ముందుకు వెళుతున్న కేరళ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు మానుకోవాలని కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలను ఖండిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం గుంటూరులోని లాడ్జి సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నేతాజీ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కొల్లిరంగారెడ్డి, ఏరువాక రైతుకూలీ సంఘం నాయకులు పాడిబండ్ల కోటేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు ఆర్.అంజిబాబు మాట్లాడారు. కేరళ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు సాగు రైతులందరికీ పూర్తి రుణమాఫీ చేసి, కొత్త రుణాలు మంజూరు చేసిందని, సబ్సిడీలు పెంచి, మద్దతు ధరలు కల్పిస్తూ రైతు, కౌలు రైతులకు గిట్టుబాటయ్యే విధంగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని అన్నారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా అన్ని రకాల సబ్సిడీలు అందిస్తోందన్నారు. వ్యవసాయ కార్మికులకు రోజువారి వేతనం రూ.600 నుండి రూ.700లకు దక్కే విధంగా కృషి చేస్తోందని, కార్మికులకు కనీస వేతన నెలకు రూ.26 వేలు అమలు చేస్తోందని చెప్పారు. బలమైన సహకార వ్యవస్థను తీసుకొచ్చి అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా చేస్తోందన్నారు. కరోనా ఉధృతిని తట్టుకొని ఇతర రాష్ట్రాలకు కూడా సహాయ సహకారాలు అందించిందని గుర్తు చేశారు. ఈ అభివృద్ధిని, సంక్షేమాన్ని చూడలేని కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. కేరళకు రావాల్సిన నిధులను నిలిపివేసిందన్నారు. వయనాడ్ తుపానుతో అతలాకుతలమై ▶ 2లో

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ తదితరులు

ఎఐ ద్వారా ఫార్మసీ రంగంలో విస్తృత పరిశోధన

ఎఎన్‌యు ఫార్మసీ కళాశాలలో ప్రారంభమైన రెండ్రోజులు జాతీయ సదస్సులో వక్తలు

8లో

సాగునీటి సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు జిల్లా కలెక్టర్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసినట్లు జలవనరుల శాఖ కృష్ణా పశ్చిమ విభాగం తెనాలి డివిజన్ ఈఈ పులిపాటి వెంకటరత్నం తెలిపారు. బాపట్ల, గుంటూరు, ప్రకాశం కృష్ణా, డెల్టా పరిధిలో 5.71 లక్షల ఎకరాల సాగు భూమికి సంబంధించి 144 నీటి సంఘాలు ఉండగా బాపట్లలో 92, గుంటూరులో 50, ప్రకాశం జిల్లాలో రెండు నీటి సంఘాలు ఉన్నాయి. 144 నీటి సంఘాలు కలిపి 22 డిస్ట్రిబ్యూటరి కమిటీలకు జరుగుతున్న ఎన్నికల్లో బాపట్లలో 14 కమిటీలు, గుంటూరులో 8 కమిటీలు కలిపి కృష్ణా, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటి చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. 14న నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయి. 17న డిస్ట్రిబ్యూటరీ కమిటి పోలింగ్ నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా ప్రాజెక్టు కమిటీ పోలింగ్ వాయిదా పడినట్లు ఇఇ తెలిపారు. ఎన్నికలను సక్రమంగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏరాట్లూ పూర్తి చేసిందన్నారు.

అరుణాంజలి

క్షణాలు నిశ్శబ్దమై అంతరంగాలు ఆవేదనా ప్రవాహాలై
జీవిత గమనంలో మీరు చూపిన ఆప్యాయతానురాగాలు,
వ్యవహారశైలిలో మీరు మిగిల్చిన అనుభూతులు
మా గుండెల్లో భద్రపరుచుకుంటాం. కన్నీరవుతున్న
స్వరంలో మనసులోని మాటలు మౌనమవుతున్నాయి.
16వ వర్ధంతి సందర్భంగా మీ ఆత్మశాంతికి
అంజలి ఘటిస్తూ అశ్రునయనాలతో.......

నిమ్మగడ్డ రామ్మోహనరావు
మాజీ ఎమ్మెల్యే మంగళగిరి

భార్య : నిమ్మగడ్డ లక్ష్మీసామ్రాజ్యం
కుమారుడు : నిమ్మగడ్డ బాలప్రకాష్
కోడలు : శారద
మనుమడు, మనుమరాలు : నిఖిల్, లాశ్య
కుమారుడు : దినకర్
కోడలు : నాగమల్లిక
మనుమరాలు : సాన్వి

కుమార్తె : వెన్నం సునీల
అల్లుడు : వెన్నం రవిశంకర్
మనుమరాళ్లు : సాయిపూజిత, ప్రణవి

హోరాహోరీగా ఆటల పోటీలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

స్థానిక శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్లో రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్, షటిల్ పోటీలు బుధవారం జరిగాయి. పలు జిల్లా నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆ కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పోటీలను మండల టిడిపి అధ్యక్షులు రమేష్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బెల్లంకొండ రాంగోపాల్రావు, మాజీ ఎంపిపి గళ్ళా బాబురావు, పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు, తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కేరళ ప్రభుత్వంపై కేంద్రం కక్షసాధింపు

(మొదటి పేజీ తరువాయి)

భారీ నష్టం సంభవించిన వారిని కేంద్రం ఆదుకోకపోగా, ఇతరుల నుండి సహాయం అందకుండా అడ్డుకుంటోందన్నారు. కేరళ రాష్ట్రాన్ని బలహీనపడే చర్యలకు పాల్పడే విధంగా కుట్ర చేస్తుందన్నారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను ప్రతి ఒక్కరూ నిరసించాలని కోరారు. కేంద్రానికి వత్తాసు పలుకుతున్న పార్టీలూ ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు నన్నపనేని శివాజీ, ఐద్వా నాయకులు కళ్యాణి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్.సమీర్, ఆవాజ్ ఎస్‌కె.బాషా, సిఐటియు నాయకులు కె.నళినీకాంత్, కె.శ్రీనివాస్, బి.లక్ష్మణరావు, కె.ముత్యాలరావు పాల్గొన్నారు.

ఆరు నెలల్లోనే అభివృద్ధి బాటలు

ప్రజాశక్తి - వినుకొండ

కూటమి ప్రభుత్వం వచ్చిన 6 నెలల్లోనే ప్రజలు అభివృద్ధి బాటలు చూస్తున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే ఆంజనేయులు అన్నారు. బుధవారం వినుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు తిరిగి ప్రాణం పోశారన్నారు. స్వల్ప వ్యవధిలోనే పోలవరానికి రూ.12వేల కోట్లు, అమరావతి రూ.15వేల కోట్ల కేంద్ర సాయాన్ని సాధించామన్నారు. జగన్ పెంచిన రౌడీయిజం, గూండాయిజాన్ని అణచివేయడంతోపాటు గంజాయి, గుట్కాలు అమ్మాలంటే భయపడేలా పరిస్థితిని మార్చామన్నారు. సీఎం చంద్రబాబు సహకారంతో డిప్యూటీ సీఎం పవన్ గ్రామాలకు రూ.4,500 కోట్లు విడుదల చేసి ఒకేసారి 30 వేలకుపైగా పనులు చేపట్టడం కొత్త చరిత్రన్నారు. గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లు మూసేసి పేదవారి నోట్లో మట్టికొట్టిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా 198 అన్న క్యాంటీన్లను పునరుద్ధరించామని తెలిపారు. దీపం పథకం కింద 50 లక్షలమందికి లబ్ధి చేకూర్చి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. ఐదేళ్లలో ఎక్కడా కొత్త రోడ్డు వేయలేదని, ఉన్న రోడ్లకు గుంతలు పెట్టారని, గుంతలు కూడా పూడ్చలేని దద్దమ్మ ప్రభుత్వాన్ని చూశామన్నారు. నేడు గుంతలను పూడుస్తున్న సమర్థమైన ప్రభుత్వాన్ని కూడా చూస్తున్నారన్నారు. సంక్రాంతి నాటికి ప్రతి గుంతను పూడ్చాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. 16.437 పోస్టులతో మెగా డీఎస్సీ, పోలీస్ శాఖలో 6,100 ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, భవిష్యత్తులో రూ.లక్షల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయని చెప్పారు. ఈ నెల 14న శివశక్తి ఫౌండేషన్ ద్వారా ఉదయం 9.45 గంటలకు గంగినేని ఫంక్షన్ హాల్లో ఇంటర్ విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రముఖ లీడ్ ఇండియా శిక్షకులు కేవీ ప్రదీప్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించామన్నారు. దానికి ప్రతి పిల్లవాడు హాజరయ్యేలా తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలని కోరారు.

మోహన్‌బాబును అరెస్టు చేయాలని జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి- మాచర్ల

మీడియా ప్రతినిధులపై సినీ నటుడు మోహన్‌బాబు దాడి అమానుషమని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఎపియుడబ్ల్యూజె) మాచర్ల అధ్యక్షులు కొత్తమాసు శ్రీరామమూర్తి అన్నారు. దాడిని ఖండిస్తూ బుధవారం బస్టాండ్ సెంటర్ నుండి రింగ్ రోడ్డు సెంటర్ వరకు ఎపియుడబ్ల్యూజె ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. శ్రీరామమూర్తి మాట్లాడుతూ మీడియా ప్రతినిధుల మైక్‌ను మోహన్‌బాబు లాక్కొని దాడి దారుణంగా దాడి చేశారన్నారు. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉన్న మీడియాకు జవాబుదారీగా ఉండాల్సిన వ్యక్తులు అసహనంతో భౌతిక దాడులకు పాల్పడడం సరైంది కాదన్నారు. సమాజానికి వాస్తవాలు చెప్పడం కోసం పాత్రికేయులు వత్తి నిబద్ధతతో పనిచేస్తారని అన్నారు. మీడియాకు మోహన్‌బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మీడియా ప్రతినిధుల పై దాడి చేసిన మోహన్ బాబును కఠినంగా శిక్షించాలన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జర్నలిస్టుల పై సినీనటుడు మోహనబాబు దాడిని హేయమైన చర్యగా జర్నలిస్టు సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్ కార్యాలయం నుండి ర్యాలీగా ఎన్ ఆర్ టి సెంటర్ వద్దనున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ హుస్సేన్‌కు వినతి పత్రం అందించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు అశోక్ కుమార్, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ మాట్లాడారు. టిడిపి నాయకులు షేక్ అబ్దుల్ రౌఫ్ మాట్లాడారు. దరియావలి, కె.చందు, ఎస్.బెంజిమెన్, ఆర్.రాజ, బి.పెద్దవీరయ్య, కె.సాంబశివరావు, కె.రమేష్, కె.మోజేష్, ఎం.భాస్కర్, నారాయణ, సుందర్‌బాబు పాల్గొన్నారు.

రైతుకు నెలకు రూ.800

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాకు రూ.3 వేల వరకూ రైతులు అదనంగా ఖర్చు చేస్తున్నారు. దీనికితోడు అడపాదడపా వచ్చిన వానలతో మానుగాయ వచ్చిందని, ధాన్యం రంగుమారే అవకాశం ఉందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పుడున్న వాతావరణమే కొనసాగితే పెద్దగా ఇబ్బంది ఉండదని, వాతావారణంలో మార్పులొచ్చి వానపడితే పంట నష్టం తప్పదని కంకిదశలో పంట ఉన్న రైతులు చెబుతున్నారు.

ఈ ఏడాది సాగునీటికి పెద్దగా ఇబ్బంది లేకున్నా గతంలో వచ్చిన నష్టాలు మిగిల్చిన అప్పులను తీర్చకుండానే కొత్తగా అప్పులు చేసిమరీ రైతులు సాగుకు ఉపక్రమించారు. ఎక్కువ మంది రైతులు సాగుకు వెనకడుగు వేయగా 75 శాతం పైగా కౌలురైతులే సాగు చేశారు. దుక్కులు మొదలు నూర్పిడి వరకు రూ.40 వేల చొప్పున ఎకరా సాగుకు ఖర్చు చేశారు. కొద్ది రోజుల్లో పంట చేతికి రానున్న దృష్ట్యా దిగుబడి ఎంత వస్తుంది..? పంట నాణ్యత ఎలా ఉంటుంది..? ధర ఎంత దక్కుతుంది..? చివరకి తమ చేతికి వచ్చేదెంత..? అందులో పెట్టుబడి ఖర్చులు, కౌలుకు ఎంత పోతుంది..? తమ చేతికేమైనా మిగులుతుందా..? అని రకరకాల లెక్కలు వేసుకుంటూ పొలాలను చూసుకుంటున్నారు.

వాతావరణం సహకరిస్తే ప్రస్తుతం పొలాల తీరునుబట్టి ఎకరాకు కనీసం 28 బస్తాలు, గరిష్టంగా 35 బస్తాల దిగుబడి వస్తుంది. మద్దతు ధర పూర్తిస్థాయిలో దక్కితే ఎకరాకు రూ.48 వేల నుండి 60 వేల వరకూ వస్తుంది. అయితే గతానుభవాల దృష్ట్యా రైతు పంట అమ్మబోయే సరికి తేమశాతం, రంగు మారడం తదితర నిబంధనలు విధించి ధర దిగ్గోసిన సందర్భాలున్నాయి. అదే జరిగితే క్వింటాళ్‌కు రూ.2100 వరకు ధర దక్కుతుంది. మొత్తంగా రైతు చేతికొచ్చేది రూ.44 వేల నుండి రూ.55 వేల వరకూ ఉండొచ్చు. ఇది కూడా కొనుగోలు కేంద్రాల్లో ఏ అవాంతరాలూ లేకుండా అమ్ముకోగలిగితే. సాధారణంగా కొనుగోలు కేంద్రాల్లో పంట అమ్మిన తర్వాత కొన్నాళ్లకు డబ్బులు రైతు ఖాతాలకు జమవుతుంటాయి. అయితే అప్పులు, వాటికి వడ్డీలు చెల్లించాలనే ఒత్తిళ్ల.. రవాణా ఇబ్బందులకు జంకే రైతులను దళారులే మధ్యపెట్టి కొనుగోలు చేస్తుంటారు. వారిచ్చే ధర కొనుగోలు కేంద్రాల్లో ఇచ్చే దానికంటే క్వింటాళ్‌కు 'ఎ' గ్రేడ్ అయితే రూ.150-200 తక్కువగానే ఉంటుంది. సాధారణ రకమైతే ధరలో కోత ఇంకాస్త ఎక్కువగానే ఉండొచ్చు.

వరి పంటకాలం నాలుగు నెలలుకాగా పొలాన్ని సాగుకు సిద్ధం చేయడానికి మరో నెల పడుతుంది. సాగుదార్లు తమతోపాటు తమ కుటుంబీకులు శ్రమపడి, వేలకువేలు పెట్టుబడి పెడితే ఐదు నెలలకు చేతికి పంట వస్తుంది. ఈ ఏడాది ఇబ్బందేమీ లేకుండా పంట పండినా, మంచి ధర దక్కినా చివరికి పెట్టుబడి వరకు పోను మిగిలేది రూ.4 వేల నుండి రూ.15 వేలు. అంటే సాగుదారునికి కుటుంబానికి వ్యవసాయం ద్వారా వచ్చే మొత్తం నెలకు రూ.800 నుండి రూ.3 వేలు. రానున్న కాలంలో వాతావరణం అనుకూలించకుంటే అదికూడా ఉండదు. పంట కంకి దశలో ఉండగా కొన్ని పొలాల్లో ఎండు తెగులు సోకడంతో దాని నుండి పంట రక్షణ కోసం రూ.2 వేల వరకూ రైతులు ఖర్చు చేశారు. వీటిని మినహాయిస్తే మిగిలేది మరీ స్వల్పం. ఇక పంట దిగబడి సరిగా రాని వారికి మరోసారి నష్టాలే.

స్వచ్ఛ నరసరావుపేటే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్పెషల్ శానిటైజేషన్ లో భాగంగా బుధవారం పట్టణంలో 32 వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు. పట్టణంలో నిర్వహిస్తున్న స్పెషల్ శానిటైజేషన్ సందర్భంగా ఎమ్మెల్యే నిత్యం వార్డులలో పారిశుధ్య పనులను పరిశీలిస్తూ మున్సిపల్ అధికారులకు సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్నారు. తానే స్వయంగా మురుగు కాలువల్లోని మురుగు, చెత్తను తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "స్వచ్ఛ నరసరావుపేట"లో భాగంగా పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. స్పెషల్ శానిటేషన్ సందర్భంగా ఆయా వార్డులలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. 32వ వార్డులో పారిశుధ్య పనుల పరిశీలనలో జెసి సూరజ్, ఆర్డిఓ మధులత పాల్గొన్నారు. టిడిపి సీనియర్ నాయకులు గుత్తా అంకమ్మ చౌదరి, మడక ప్రసాద్, వేముల పాండు, కిరణ్, క్రాంతి, మువ్వల రవీంద్ర, పఠాన్ మహమ్మద్, బాలరాజు పాల్గొన్నారు.

కత్తెర పురుగును నివారిస్తే అధిక దిగుబడులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మొక్కజొన్నల్లో కత్తెర పురుగు నివారణ ద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని నరసరావుపేట మండల వ్యవసాయ శాఖ అధికారి వి.నరేంద్ర బాబు అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నరసరావుపేట మండలంలోని కొండ కావూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పైరులో కత్తెర పురుగును గుర్తించి నివారణకు యాజమాన్య చర్యలు వివరించారు.

కత్తెర పురుగు గుర్తింపు చిహ్నాలు

గొంగళి పురుగు ముఖంపై తిరగబడిన "వి (గ్రీ)" ఆకారంలో తెల్లని చారలను కలిగి ఉండును గొంగళి పురుగు ఉదర భాగంలో ఆఖరి ఖండితంపై నల్లటి 4 చుక్కలు చతురస్రాకారంలో ఉంటుంది. మొదటి దశ గొంగళి పురుగు ఆకులపై పత్ర హరితాన్ని గోకి తింటూ ఆకులపై రంధ్రాలను చేస్తుంది. ఇటువంటి రంధ్రాలు ఆకులపై నిలువుగా కనిపిస్తాయి. గొంగళి పురుగు పెరిగే కొద్ది ఆకుల చివరల నుండి తింటూ ఆకులను కత్తిరించినట్టుగా ఉండడం, ఆకులను పూర్తిగా తినివేయుట గమనించవచ్చు. ఆకు సుడులను, కాండాన్ని తొలిచి రంధ్రాలు చేసి పంటను నష్టపరుస్తుంది. మొక్కజొన్న కంకి లోకి కూడా ఈ పురుగు చేరి లేతకండే భాగాన్ని తిని నష్టపరుస్తుంది.

కత్తెర పురుగు నివారణ చర్యలు

లోతు దిక్కులు దున్నుకోవడం వలన పురుగు యొక్క నిద్రావస్థ దశలో ఉండడంతో నాశనం అవుతాయి. పంట చుట్టూ నాలుగు వరుసలు సూపర్ నేపియర్ గడ్డిని ఎర పంటగా వేసుకోవాలి.

ఎకరానికి 4 నుండి 5 వరకు లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా పురుగు ఉధతి తగ్గుతుంది. గుడ్ల సముదాయాలను గుర్తించి వేరువేసి నాశనం చేయాలి. కత్తెర పురుగు గుడ్లను ఆశించే ట్రైకో గ్రామ బదనికలను ఎకరానికి 20వేల చొప్పున మొట్టరిజియంను హెక్టారుకు ఐదు గ్రాముల చొప్పున పొలంలో విడుదల చేసుకోవాలి. గుడ్లను గమనించిన వెంటనే ఎకరానికి ఒక లీటరు వేప నూనె పిచికారి చేయాలి. తొలి దశ గొంగళి పురుగు నివారణకు ఎకరానికి 500 మిల్లీలీటర్ల క్లోరిపైరిఫాస్ లేదా 400 మిల్లీలీటర్ల క్వినాల్ ఫాస్ మందును పిచికారి చేయాలి.

గొంగళి పురుగు ఉధతి ఎక్కువగా ఉంటే ఎమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్.డి 80 గ్రాములు లేదా స్పైనో సాడ్ 45% ఎస్.సి 60 మి లి ఎకరాకి సుడులు లేదా మొవ్వ లోపలి ఆకులు పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.

అవసరాన్ని బట్టి రెండు నుంచి మూడుసార్లు మందులను పిచికారి చేయాలి. ఎదిగిన గొంగళి పురుగు ల యొక్క నివారణకు 10 కిలోల తవుడు ం రెండు కిలోల బెల్లం రెండు లీటర్ల నీరు కలిపి 24 గంటల పాటు పులియబెట్టి ఆ మిశ్రమానికి 100 గ్రాముల దయోడికార్బ్ మందును జోడించి సాయంత్రం వేళల్లో మొవ్వులలో వేయాలి. పురుగు యొక్క ఉనికిని గైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ సరైన యాజమాన్య పద్ధతులను సరైన సమయంలో పాటించాలి ఈ పురుగు యొక్క ఉధతి, పురుగువల్ల కలిగే అపారమైన నష్టాన్ని నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ వి.ఎ. ఏ శ్రీకాంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు

రాజధాని రైతుల ప్లాట్ల కేటాయింపునకు

నేడు ఈ - లాటరీ

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూ సమీకరణ పథకంలో భూములిచ్చిన రైతులకు ప్రత్యామ్నాయ రిటర్నబుల్ ప్లాట్లకు గురువారం విజయవాడ లెనిన్ సెంటరులోని సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ - లాటరీ నిర్వహిస్తున్నారు. అమరావతిలో 14 గ్రామాలలోని రైతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ప్రత్యామ్నాయ రిటర్నబుల్ ప్లాట్లు కేటాయిస్తారు. ఈ – లాటరీ జరగనున్న గ్రామాలు.. నవులూరు 1అండ్2, కురగల్లు,1అండ్2, నిడమర్రు 1అండ్1, రాయపూడి 1అండ్2, లింగాయపాలెం, మల్కాపురం, నెక్కల్లు, శాఖమూరు, తుళ్లూరు 1అండ్2, వెలగపూడి, మందడం 1అండ్2, అనంతవరం, ఐనవోలు తదితర గ్రామాలలో సంబంధిత రైతులు హాజరుకావాలని సిఆర్‌డిఎ కమిషనర్ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదలైంది.

నిబంధనలు పాటించని వాహనదార్లపై కేసులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : నిబంధనలు పాటించని వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు రవాణా శాఖ ట్రాన్స్ పోర్ట్ జిల్లా స్కాడ్ జంగాల అనిల్ కుమార్ తెలిపారు. బుధవారం మండలం పరిధిలోని యనమదల ఎన్‌హెచ్ 16పై వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని వాహన దారులపై కేసులు నమోదు చేసి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

చర్చిలపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

దేశంలో క్రైస్తవులపై, చర్చిలపై జరుగుతున్న దాడులు అరికట్టాలని మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పాస్టర్స్ ఫెలోషిప్, కల్వరి కప కార్యదర్శి సిహెచ్ గాంధీ ప్రభుత్వాన్ని కోరారు. తాడేపల్లి పట్టణంలోని సీతానగరం కల్వరి ప్రార్థన మందిరంలో బుధవారం 116 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పేదలను లక్ష్యంగా చేసుకొని దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్రైస్తవులకు చట్టసభల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎంసీ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు టి రాజేష్, గౌరవ అధ్యక్షులు బి జగన్మోహన్రావు, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ ఆశీర్వాదం, కోశాధికారి శ్యాంబాబు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం తెనాలి మండలం ఎరుకలపూడి గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో లాం ఫామ్ శాస్త్రవేత్త డాక్టర్ రత్నం పాల్గొని రైతులతో మాట్లాడారు. మొక్కజొన్న, జొన్న పంటల యాజమాన్య పద్ధతులను వివరించారు. పంటలకు వినియోగించే ఎరువుల ప్రాధాన్యతను తెలిపారు. మండల వ్యవసాయ అధికారి జి ప్రేమ సాగర్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్న దాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. రబీలో పంటలు భీమ ప్రీమియంను డిసెంబర్ 15 నాటికి కామన్ సర్వీస్ సెంటర్ లో రైతులు చెల్లించటానికి సంసిద్ధం కావాలన్నారు. ఏరుకలపూడి సర్పంచ్ పసుపులేటి సామ్రాజ్యం విఎఎ మణిదీపిక ప్రకతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్ విజయలక్ష్మి రమణ రత్నకుమారి పాల్గొన్నారు.

పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు మండలం కట్రపాడు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిని బి సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజన్లో వేసే మొక్కజొన్న, శనగ, పెసర, జొన్న తదితర పంటలకు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ఈనెల 15 వ తారీకుతో గడువు ముగుస్తుందని, రైతులు త్వరితగతిన ఇన్సూరెన్స్ పథకంలో చేరాలని సూచించారు. అదేవిధంగా పత్తిలో రెండవ పూత దశలో గులాబీ రంగు, కాయ తొలుచు పురుగు ఉధృతి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు .

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గ ప్రజల ఆరోగ్యాలకు కూటమి ప్రభుత్వం చేయూతనందిస్తుందని టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి అన్నారు. మంగళగిరి పట్టణంలోని 25వ వార్డు హుస్సేన్ కట్టకు చెందిన కందుల వీర రాఘవులకు రూ 30,786, 2వ వార్డుకు చెందిన కడియం హనుమంతురావు కుమారుడు సుజయివాన్ కు రూ 45,084 విలువైన చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఊట్ల కనకదుర్గ మల్లేశ్వరి, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ సుభాని, 2వ వార్డు అధ్యక్షులు సుఖమంచి గిరిబాబు, 26వ వార్డు అధ్యక్షులు ఉద్దంటి గాంధీ, పట్టణ కమిటీ సభ్యులు కారంపూడి చిరంజీవి, తాడిగిరి సుధీర్, రంగిశెట్టి బాబీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి చేబ్రోలు : బుధవారం గొడవర్రు గ్రామంలో ముఖ్యమంత్రి సహాయానిధి చెక్కులను లబ్ధిదారు పసుపులేటి భీమరాజుకు స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవడానికి, రూ. 37,205 చెక్కులను బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతు ఎవరికైనా ఆపద సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల , గ్రామ పార్టీ నాయకులు , కార్యకర్తలు

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతి

ప్రజాశక్తి - మేడికొండూరు

రోడ్డుపై వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి, రోడ్డు పక్కనే ఉన్న బ్రిడ్జిని ఢీకొనడంతో వ్యక్తి అక్కడక్కడ దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని పేరేచర్ల నరసరావుపేట రోడ్ లోని డోకిపర్రు అడ్డరోడ్డు వద్ద బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సంక్రాంతి పాడు గ్రామానికి చెందిన ఎన్ విజయ్ కుమార్ ద్విచక్ర వాహనం మీద గుంటూరుకు బయలుదేరి వెళుతున్నాడు. మార్గమధ్యలో మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బ్రిడ్జిని ఢీకొనడంతో విజయ్ కుమార్(35) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాద సంఘటన విషయం తెలుసుకున్న మేడికొండూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

60 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

అక్రమంగా తరలిస్తున్న 60 మద్యం సీసాలను ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. సత్తెనపల్లి మండలం ఫణిదం నుండి మద్యం బాటిల్స్ అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు సత్తెనపల్లి ఎక్సైజ్ సిఐ పి విజయ్ కుమార్ సిబ్బందితో మాటు వేసి పట్టుకున్నారు. మద్యం బాటిల్స్ తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 60 మద్యం బాటిల్స్ ను స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితుడ్ని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ సిఐ విజయ్ కుమార్ తెలిపారు.

రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం

ప్రజాశక్తి - తాడేపల్లి

నులకపేట రైల్వే ట్రాక్ పై గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వేపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతి చెందిన వృద్ధురాలు షుమారు 60నుండి 70 సంవత్సరాల వయస్సు ఉంటుందని, శనగపిండి రంగు చీర, కాఫీరంగు జాకెట్ ధరించి ఉన్నదని తెలిపారు. ఎవరైన ఆచూకి తెలిస్తే గుంటూరు రైల్వే పోలీసు స్టేషన్లో 9440627546 నంబర్‌లో సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలియజేశారు.

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) :: TENALI
I.P. NO.47/2024

Between:
Veeramallu Karthikeya ....Petitioner/debtor
and
1. Sandhra Srinivasa Rao, S/o. Koteswara Rao, Kolakaluru.
2. Gangasani Naga Lakshmi W/o.Nagrajau, Kolakaluru.
3. Shaik John Saida, S/o. Shaik Mohammad Haneef, Kolakaluru.
4. Shaik Khaja Nazumuddin S/o. Shaik Galeeb Saheb, Kolakaluru.
5. Shaik Karimulla S/o. Shaik Khaja Nazunuddin, Kolakaluru.
6. Pandi Venkata Prasad S/o.Pandi Chalamaiah, Kolakaluru.
7. Uppala Srinvasa Rao S/o. Venkateswarlu, Kolakaluru.
8. Veeramallu Venkateswarlu S/o.Sriramulu, Kolakaluru
9. Simhadri Syamala W/o. Suresh, Pedakakani.
10. Kanala Vasudhara Devi w/o. Kanala Babau Rao, Chenchupet, Tenali.
11. Dhulla Lakshmi Thulasi w/o. Uma Narasimha Rao, Kolakaluru
12. Vuddhanthi Geetha Devi W/o. Uma Maheswara Rao, Muttemsettipalem, Tenali.
13. Bandaru Narasimha Rao, S/o Sivaiah, Kolakaluru.

..... Respondents

పై నెంబరు ఐ.పిలో పిటీషనర్ తనను ఇన్సాల్వేంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ పిటీషన్ ను దాఖలు చేయగా, సదరు పిటిషన్‌పై ఎవరికైన అభ్యంతరములు వుంటే తెలుపుకోమని శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసుకు ఆర్డర్ వేస్తూ మీ హాజరు నిమిత్తము ది.03-01-2025వ తేదికి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం గం॥ 10-30 ని॥ లకు మీరు స్వయంగా గాని, మీ తరపు న్యాయవాది ద్వారాగాని శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేని యెడల సదరు పిటీషన్ ను మీ పరోక్షమున విచారించి, తీర్మానించ బడునని యావన్మందికి తెలియజేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో
వాయిదా తేది. 03-01-2025

యం. మాణిక్యరావు
పిటీషనర్ తరపు న్యాయవాది, తెనాలి.
సెల్ నెం.9490449696.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) :: TENALI
E.P. NO. 99 / 2023
IN O.S. NO. 149 / 2020

Between:
Vuyyuru Venkata Subbamma @ Subbamma ..... D.Hr.
And
Vuyyuru Sankar Rao ..... J.Dr.

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నంబరు ఇ.పి. బాపతు డి.హెచ్.ఆర్. బాకీ వసూలు నిమిత్తం ఈ దిగువన పేర్కొనబడిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది.27-12-2024వ తేదీన ఉదయం గం.10.30 ని॥ లకు పై శ్రీ కోర్టు వారి ఆవరణ నందు బహిరంగ వేలము చేయబడును. ఆసక్తి గలవారు వేలము నందు పాల్గొనవచ్చును. వేలము షరతులు, వేలము సమయము నందు తెలియపరచబడును.

వేలము చేయు ఆస్తి వివరము

Guntur District - Amarthaluru Sub District Amarthaluru Mandal, Pedapudi grama panchayat, Pedapudi village - D.No. 158/1 - Ac. 0-64 cents, D.No. 159/2 - Ac.1-05 cents, in total Ac.1-69 cents towards northern side of it an extent of Ac. 0-69 cents of wet land bounded by:
East : Angirekula Srinivasa Rao's property
South:Raparla Venkata Ratnam's property
West : Nizampatnam Kaluva boundary
North : Chadalavada Venugopala Rao's property
Within these boundaries an extent of Ac.0-69 cents of wet land.
D.H.R. Value ...Rs. 5,00,000/-
Ameena Value ...Rs.15,00,000/-
Further hearing Date ..08-01-2025
Tenali,
Dt. 12-12-2024

దిండు శ్రీనివాస్ **B. Com, B.L.,.**
డి.హెచ్.ఆర్. తరుపున న్యాయవాది, తెనాలి.
సెల్ నెం : 9849229704.

IN THE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA
O.S. No.27/2020

BETWEEN:
Vuyyuru Sambi Reddy ..... Plaintiff
AND
M/s. Sri Vijetha Constructions (Regd. Firm) Guntur, rep. by its Mg. Partner, Balabadrapatruni Varun Vamsi and 10 others ...... Defendants

To
Defendant No.8
Srirama Mahendra Babu, S/o. Kameswara Rao, D. No.14-5-52/1, Islampet, Bapatla Town, Guntur District

The above said suit stands posted to 27.12.2024 for appearance of the above defendants to answer the claim of the plaintiff either in person or through their counsel from 10.30 A.M., onwards.
Vijayawada
Date:

//BY ORDER//

B. KOTI REDDY
B.S. RATNAKAR REDDY
ADVOCATES
Off: Ammana Estates
Governorpet, Vijayawada-520002
Mob: 9490148500
Off: 0866-2432799

పురపాలక సంఘ కార్యాలయము, సత్తెనపల్లి

ఆర్.ఓ.సి.నెం.113/2021/ఎ1 **తేది.11-12-2024**

బహిరంగ వేలము నోటీసు -3 కాల్

సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలో గల మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి ఈ దిగువ తెలిపిన షాపు రూములు నిర్ణయించిన నెలసరి అద్దె పై బహిరంగ వేలమును ది.23-12-2024న సోమవారం ఉదయం 11.00 గంటలకు మునిసిపల్ కార్యాలయము నందు మునిసిపల్ కమీషనరు గారిచే గాని లేదా వారి అనుమతి పొందిన అధికారి వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును.(1) N.T.R. మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపు నెంబర్లు:- 3,10,11,12,13,14,18,19,20,21, 22,25,27,28,29,33,34,36, 37 మరియు 39 (2) శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య కాంప్లెక్స్ నందలి షాపు నెంబర్లు: - 7,8,10,16 మరియు First Floor, Second Floor Open Hall (3) శ్రీ వై.వి.రెడ్డి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపు నెం:- 8 లను బహిరంగ వేలము నిర్వహించబడును. సదరు బహిరంగ వేలమునకు సంబంధించిన పూర్తి వివరములు కార్యాలయము పనిచేయు వేళలలో రెవిన్యూ విభాగము నందు అడిగి తెలుసుకొనవచ్చును

సం/- కొలిమి షమ్మి, కమీషనరు,
సత్తెనపల్లి పురపాలక సంఘం.

రెట్టింపైన వలసలు

- వ్యవసాయం ఆలస్యంతో తగ్గిన పనులు
- ఉపాధి హామీ పనుల కల్పనపైనా కొరవడిన చొరవ
- ఊరు విడిచి పొమ్మంటున్న కూలీల ఆర్థిక అవసరాలు

గణపవరం వెళ్లే మార్గంలో దెబ్బతిన్న దున్నేసిన పత్తి పొలం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గతేడాది అంతంతమాత్రంగానైనా దొరికిన పనులతో నెట్టుకొచ్చిన కూలీలు ఈ ఏడాది బొత్తిగా పనుల్లేక వలస బాట పడుతున్నారు. సీజన్ దాటిన తర్వాత ఆలస్యంగా పంటలు సాగవడం, ఉపాధి హామీ పనులు చూపకపోవడంతో తదితర కారణాలతో పట్టణంతోపాటు గ్రామాల్లోనూ కూలీలకు పనులు లేకుండా పోయాయి. పూట గడవడమే కష్టంగా ఉండడం, మరోవైపు పండుగలు రానున్న నేపథ్యంలో అవసరాలు తీరాలంటే వలసబాట పట్టక తప్పని పరిస్థితుల్లోకి నెట్టబడ్డారు. గతేడాదికంటే రెట్టింపు సంఖ్యలో ఊళ్లను వదిలి పరాయి ప్రాంతాలకు పనుల కోసం వెళుతున్నారు.

సాధారణంగా ప్రతి సంవత్సరం చిలకలూరిపేట పట్టణంలోని నెహ్రూ నగర్, సంజీవ నగర్, ఆదిఆంధ్ర కాలనీ, వెంగళరెడ్డి కాలనీ, రాగన్నపాలెంతోపాటు చుట్టుపక్కల కాలనీల నుండి 1500 మంది ప్రతిఏడాది ఈ సీజన్‌లో కర్నాటక రాష్ట్రంలోని మైసూర్, ఇతర ప్రాంతాలకు పొగాకు పనులకు వలసెళ్తుంటారు. అయితే ఈ ఏడాది వలసెళ్లేవారి సంఖ్య 3 వేలకు పైగా ఉంది. చిలకలూరిపేట మండలంలో 23 గ్రామాలుండగా 18 గ్రామాల నుండి కూలీలు ప్రతిఏటా 4 వేలకుపైగా వసతెళ్లేవారు ఈ ఏడాది 6 వేల మంది వరకూ వెళ్లారు. మైసూర్‌లో ఒక విడత పనులు పూర్తవడంతో వెనక్కు వచ్చినవారు మళ్లీ తెలంగాణలోని జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం తదితర ప్రాంతాల్లో పనులు మాట్లాడు కుంటున్నారు. సాధారణంగా కూలీల్లో 75 శాతం మంది వ్యవసాయ పనులు ఆధారంగా జీవిస్తే మిగతా 25 శాతం మంది నిర్మాణ రంగంలో ఉపాధి వెదు క్కునే వారు. అయితే ఈ ఏడాది సాగు ఆలస్యం కావడంతో పనిదినాలు పడిపోయాయి.

మండలంలో ప్రధానంగా పొగాకు, పత్తి, మిర్చి, శనగ సాగవుతున్నాయి. ప్రతి ఏడాది మిర్చి కోతలు, పత్తి తీతలు, పొగాకు, శనగ నాట్లు పనులు ఉండేవి. ఈ ఏడాది తరచూ నాన్పుడు వర్షాల కారణంగా సాగు పనులకు ఆటంకం ఏర్పడింది. మిర్చి నాట్లు ఆలస్యమయ్యాయి. పత్తి సరిగా పండకపోవడంతో మధ్యలోనే ఆ పంటను విరమించి పొగాకు సాగువైపు మరలారు. దీంతో కూలీకు పనిదినాలు తగ్గిపో యాయి. మరోవైపు ఉపాధి హామీ పనులూ కల్పించడం లేదు. గతేడాది పంటకాల్వలు, పొలాల్లోని నీటి కుంటల తవ్వకం పనులు చేయించినా ఈ ఏడాది వాటినీ ఆపేశారు. పనులు ఎందుకు చేయించడం లేదనే ప్రశ్నలకూ అధికారుల వద్ద సరైన సమా ధానం రావడం లేదు. ఈ నేపథ్యంలో ఇల్లు గడవాలంటే ఊరు విడిచి వెళ్లని తప్పని పరిస్థితులు కూలీలకు ఏర్పడ్డాయి. దీనికితోడు ఫైనాన్స్ సంస్థలకు నెలవారీ చెల్లించాల్సిన కిస్తీలు, డ్వాక్రా రుణ వాయిదాలు కూలీలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ఈ నెలలో క్రిస్మస్, మరుసటి నెలలో సంక్రాంతి పండగల దృష్ట్యా వచ్చే అదనపు ఖర్చులు కళ్లముందు కదలాడుతుండడంతో కుటుంబాలకు కుటుంబాలు వలసబాట పడుతున్నాయి. ఇలా వచ్చేవారు పెరగడంతో అక్కడ కూడా పనులు ఎక్కువ రోజులు ఉండడం లేదని కూలీలు చెబుతున్నారు. పొలాల మధ్య, పొగాకు బ్యార్న్లల్లో భయభయంగా గడుపుతూ ఒళ్లు గుల్ల చేసుకుంటే రూ.15-20 వేలు వస్తాయని, వాటితో అప్పులు, పండగలు గడుస్తాయని చెబుతున్నారు. వలసెళ్లిన ప్రాంతాల్లో ఒక దఫా పనులు పూర్తవడంతో కొందరు సొంతూళ్లకు తిరిగి వచ్చారు. క్రిస్మస్ అయిపోయాగా మళ్లీ వెళ్లిపోతామని చెబుతున్నారు. వ్యవసా యం అనుకూలంగా ఉన్నా, ఉపాధి హామీ పనులు కల్పించినా తమకు ఈ దుస్థితి వచ్చేది కాదని, నెలల తరబడి ఊరుగాని ఊర్లలో పనులు వెతుక్కోవాల్సిన అవసరం వచ్చేది కాదని, సొంతూళ్లోనే నాలుగు రూపాయలు సంపాదించుకుని నిశ్చింతగా గడిపేవారమని కూలీలు అంటున్నారు. మైసూర్ ప్రాంతంలో పాములు, తేళ్లు ఎక్కువని, అయినా అక్కడ పనులకు వెళ్లక తప్పడం లేదని ఆవేదనకు గురవుతున్నారు.

అప్పమ్మకు జనసేన పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

జనసేనలోకి గోళ్లపాడు సర్పంచ్

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని గోళ్లపాడు సర్పంచ్ గోపు అప్పమ్మ వైసిపిని వీడి జనసేనలో చేరారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు ఆధ్వర్యంలో జనసేన పార్టీ కండువా కప్పుకున్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను గౌరవించి, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గోళ్లపాడు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడుపుతానని అప్పమ్మ చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, జనసేన కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి పగడాల శివపార్వతి పాల్గొన్నారు.

పట్లవీడు సచివాలయంలో నోటీసులు అంటిస్తున్న అధికారులు

14న నీటి సంఘాల ఎన్నికలు

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లె, గుడిపాడు, వజ్రాలపాడు, పట్లవీడు గ్రామాల్లోని మైనర్ ఇరిగేషన్ చెరువుల సాగు నీటి సంఘాల చైర్మన్ ఎన్నికల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 14న ఉదయం 9 గంటలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ షేక్ బాషా తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ సంబంధించి నోటీసులను ఆయా గ్రామాల సచివాలయాలు పాఠశాలలలో రైతులకు తెలిసే విధంగా అంటించి గ్రామాలలో దండోరా నిర్వహించారు. ఎన్నికలలో అధ్యక్ష ఉపాధ్యక్ష ప్రాదేశిక సభ్యులను ఎన్నుకోనున్నట్లు చెప్పారు. తుది ఫలితాలను అదే రోజు వెల్లడిస్తామన్నారు. అభ్యర్థులు తమ నామినేషన్లను ఎంపీడీవో కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని పట్లవీడును ఎన్నికల అధికారి, మండల వ్యవసాయాధికారి పుల్లారెడ్డి బుధవారం సందర్శించారు.

డ్వాక్రా మహిళల ఆర్థిక స్థితిగతులపై సర్వే

ప్రజాశక్తి- వెల్దుర్తి

మండలంలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక స్థితిగతులపై సర్వే నిర్వహిస్తున్నట్లు ఎపిఎం కె.అంజినాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అంజినాయక్ మాట్లాడుతూ మండల పరిధిలో 1272 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయన్నారు. డ్వాక్రా మహిళల ఆదాయ వనరులు గూరించి, వారి ఆర్థికాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లటానికి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే ఆధారంగా స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రుణాలపై 50 శాతం సబ్సిడి లభిస్తుందన్నారు. త్వరతగతిన సర్వే పూర్తి చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

పట్టాలైనా ఇవ్వండి.. పథకాలైనా అమలు చేయండి..

పేదలు సాగు చేస్తున్న పోరంబోకు భూముల అంశంపై వ్యవసాయ కార్మిక సంఘం వినతి

అధికారులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - క్రోసూరు

పేదల సాగు చేసుకుంటున్న పోరంబోకు భూములకు పట్టాలివ్వాలని, లేకుంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా రెవెన్యూ రికార్డుల్లో అయినా నమోదు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు కోరారు. మండలంలోని గరికపాడులో బుధవారం జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులో పలు అంశాలను ఆయన అధికారుల దృష్టికి తేవడంతోపాటు వినతిపత్రం ఇచ్చారు. సర్వే నంబర్ 132లో సాగు చేసుకుంటున్నారని, పోరంబోకు భూములను సాగు చేసుకుంటున్న పేదలు గ్రామాల్లో పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారు ఆయా భూముల్లో వివిధ పంటలు సాగు చేసుకుని కుటుంబాలు పోషించుకుంటున్నారని చెప్పారు. అతివృష్టి, అనావృష్టి వల్ల పంట నష్టం వాటిల్లితే పరిహారం దక్కక ఆర్థికంగా దెబ్బతింటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని, లేదా ప్రభుత్వం ఇచ్చేటువంటి పంట నష్ట పరిహారం, పెట్టుబడి సహాయాలు, ఇతర సంక్షేమ పథకాలు వర్తించేలా రెవెన్యూ రికార్డులో నమోదు చేయాలని, ఈ-క్రాప్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఏపూరి వెంకటేశ్వర్లు, సాగు దారులు షేక్ పెద మాబు సాహెబ్, షేక్ మహమ్మద్ షా, షేక్ సలీం పాల్గొన్నారు.

వర్సిటీ వాలీబాల్ జట్టుకు కృష్ణవేణి విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు ఈనెల 9,10 తేదీల్లో గుంటూరు రూరల్ పరిధిలోని చౌడవరంలోని ఆర్.వి.ఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగాయి. ఈ పోటీలలో తమ కళాశాల జట్టు ఉత్తమ ప్రతిభ కనపరచి ప్రథమ స్థానం సాధించిందని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ అనుభవం కలిగిన వ్యాయామ అధ్యాపకులచే శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. పోటీలలో ప్రతిభ చాటిన ఎ.ఉమామహేశ్వరరావు జె.నితిన్ కిరణ్, జె.కళ్యాణ్ కుమార్, పి.సాహిత్ సింగ్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 18 నుండి 22 వరకు కేరళ యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌లో తమ విద్యార్థులు పాల్గొంటారని కళాశాల పిడి ఈదర ఆదిబాబు తెలిపారు. ఎంపికైన వారిని ప్రిన్సిపాల్, పీడీతోపాటు డైరెక్టర్ కె.నాసరయ్య, కె.వీరరాఘవులు, మహమ్మద్ అభినందించారు.

గుంత రూపంలో పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మున్సిపల్ అధికారులు తవ్విన గుంట ప్రమాదం భరితంగా మారింది. గుంటూరు-మాచర్ల రహదారికి సమాంతరంగా ఇటీవల సిమెంట్ రోడ్డు వేశారు. తాగునీటి సరఫరాలో భాగంగా వాల్ కోసం జెడ్పి బాలికల ఉన్నత పాఠశాల ఎదుట మున్సిపల్ అధికారులు గుంతను తవించారు. దానిమీద మూత ఏమీ ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ప్రమాదాల భారిన పడుతున్నారు. మాచర్ల, పిడుగురాళ్ల బస్సులు నిలిపే చోట గుంత వుండటంతో ప్రయాణికులు బస్సు ఎక్కి దిగే సందర్భాల్లో ఇబ్బందులు పడుతున్నారు. గుంతను స్వరమే మూసేయాలని, ప్రయాణికులు, విద్యార్థినులు కోరుతున్నారు.

సత్తెనపల్లిలో నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళాను నిర్వహిస్తామని ఆ సంస్థ పల్నాడు జిల్లా అధికారి తమ్మాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తెనపల్లిలోని ప్రభుత్వం జూనియర్ కాలేజీలో జాబ్‌మేళా ఉంటుందని, 10వ తరగతి, ఐటిఐ, డిగ్రీ, బి టెక్ డిప్లమో, పీజీ, ఫార్మసి చదివిన 18-40 ఏళ్లలోపువారు అర్హులని తెలిపారు. హాజరయ్యేవారు ధ్రువపత్రాలతోపాటు పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకుని ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల మధ్య హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 8074393466, 9494986164 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆర్‌పిల జీతాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

మెప్మా ఆర్‌పిల జీతాలు వెంటనే విడుదల చేయాలని మెప్మా ఆర్‌పిల యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు కోరారు. యూనియన్ నగర విస్తృత సమావేశం బుధవారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు నెలల నుండి జీతాలు ఇవ్వట్లేదని, ఆర్‌పిలు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. ఆర్‌పిలపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఆర్‌పిలపై పనిభారం తగ్గించాలని, మూడు సంవత్సరాల కాలపరిమితి నిబంధన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సైదాబీ, హసీనా, అనూష, రత్నకుమారి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి

ఎనిమిదో రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి -తాడేపల్లి

కోర్టు తీర్పుల ప్రకారం తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎస్.కె కాశీం, బి జోజప్ప, జి కొండ, ఏ నాగేశ్వరరావు, వై యహెూశోవ కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఏఐఎఫ్ టి యు నాయకులు కే కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రస్తుత మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ మేరకు సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం కూడా ఈ సమస్యపై చొరవ తీసుకొని కార్మికులను, యాజమాన్యాన్ని కూర్చోబెట్టి మంచి వాతావరణంలో సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్, బి అంకయ్య, ఎం ఆశీర్వాదం, కె ఆదినారాయణ, వై నాగేశ్వరరావు, బి సూర్యప్రకాష్, ఎస్ కే భాష, ఎండి రహీమ్తుల్లా, ఏం శాస్త్రి, ఎస్ కే ఇమాంబి, ఎం శివకుమారి, వై రమాదేవి, టి దుర్గా భవాని, ఈ శారమ్మ, డి నాగమల్లేశ్వరి, రమణ, బుజ్జి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామిరెడ్డితోటలో ప్రచారం చేస్తున్న సిపియం నాయకులు

దర్గాను సందర్శించిన నేషనల్ మైనార్టీ కమిషన్ సభ్యులు షహజాదీ

ప్రజాశక్తి-గుంటూరు

నేషనల్ మైనారిటీ కమిషన్ సభ్యులు సయ్యద్ షహజాదీ బుధవారం పెదకాకానిలోని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా బాబా దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా షహజాదీకి జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి మహబూబ్ షరీఫ్, వక్ఫ్‌బోర్డ్ ఇన్స్పెక్టర్, దర్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్.ముక్తియార్ భాషా దర్గా మర్యాదలతో స్వాగతం పలికారు. దర్గాలోని బాబా అవులియాకు ఛాదర్‌ను బహుకరించి ఆశీర్వాదం అందుకున్నారు. అనంతరం దర్గా ఈఓ కార్యాలయంలో పెదకాకాని మండల టిడిపి మండల అధ్యక్షులు మురళి, మైనారిటీ అధ్యక్షులు మౌజన్‌లు దర్గాను సందర్శించే యాత్రికులకు వసతి, భోజనం చేయుటకు షెడ్‌లు, మహిళలకు దుస్తులు మార్చుకునేందుకు గదులు నిర్మించాలని మైనారిటీ కమిషన్ మెంబర్‌ను కోరారు . ఈ కార్యక్రమంలో మాజీ వక్ఫ్ బోర్డ్ స్పెషల్ ఆఫీసర్ షిరిల్ బేగం, మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సయ్యద్ ఆదామ్ సాహెబ్, పెదకాకాని విఆర్‌ఓ అనిల్, షర్మిలా, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ ఒప్పందంలో అవినీతి అక్రమాల కారణంగానే ప్రజలపై భారాలు పెరిగాయని సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు అన్నారు. విద్యుత్ భారాలను వివరిస్తూ బుధవారం రామిరెడ్డితోటలో సిపియం నాయకులు, కార్యకర్తలు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలకు లంచాలు ఇచ్చి ఆయాచిత లబ్ధి పొందేందుకు కార్పొరేట్ శక్తులు చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి ఒప్పందాలన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా అదానీపై ఇలాంటి ఆరోపణలే వచ్చినా కేంద్ర ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండడంతో ఎలాంటి విచారణ జరగలేదన్నారు. ప్రస్తుతం అమెరికన్ ప్రభుత్వమే కేసు నమోదు చేయడంతో మన దేశ ప్రతిష్ట మసకబారిందని అన్నారు. అదాని విదేశీ బొగ్గును 10శాతం కొనాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు షరతు పెట్టిందని, ఎక్కువ ధరకు కొన్న కారణంగా విద్యుత్ ఛార్జీలు పెరిగాయని, ఆభారం ప్రజలపై పడిందని తెలిపారు. ప్రస్తుత వివాదాలకు కారణమైన సోలార్ విద్యుత్ ఒప్పందం కూడా అలాంటిదేనని అన్నారు. భవన ఒక వైపు నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం విద్యుత్ భారాలు మోపిందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ స్థానిక శాఖ కార్యదర్శి టి.రాధ, నక్కా మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి, నల్లపాడులో రేపు జాబ్‌మేళాలు

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 13న తెనాలి, నల్లపాడులో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి కొండా సంజీవరావు తెలిపారు. తెనాలిలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలో, నల్లపాడులోని ఎంబిటిఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజిలో ఈ జాబ్‌మేళాలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బి.టెక్, డిప్లొమా, ఫార్మసి, పి.జి చదివిన, 18-35 వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు వారి యొక్క బయోడేటా/రెస్యూమ్, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. కావున యువతీ యువకులు ఈజాబ్ మేళాలలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలు స్వేచ్ఛను అనుభవిస్తున్నారు : డేగల

ప్రజాశక్తి-గుంటూరు

వైసీపీ పాలనలో రాష్ట్రప్రజలు స్వేచ్ఛ స్వతంత్రాలను పోగొట్టుకున్నారని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. బుధవారం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడారు. గడిచిన 6 నెలల నుంచి ప్రజలు స్వేచ్ఛ స్వతంత్రాలను అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. ఈ 6 నెలల్లో ప్రజలు తమ సమస్యలను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వానికి చెప్పుకుంటున్నారని తెలిపారు. సంక్షేమం విషయంలో వైసీపీ ప్రభుత్వానికి టీడీపీ ప్రభుత్వనికి నక్కకి, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా ఎక్కడా ప్రజా సంక్షేమానికి ఇబ్బంది కలగకుండా చూస్తున్నామని పేర్కొన్నారు. అన్ని వర్గాల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కషి చేస్తుందన్నారు. జగన్ తను చేసిన అక్రమాలను, కుంభకోణాల నుంచి దష్టి మళ్లించడానికి కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు.

కలెక్టరేట్ ఏఒకు వినతిపత్రం ఇస్తున్న వివిధ సంఘాల నాయకులు

స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఒప్పందాలను రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేసుకొని, రాష్ట్ర ప్రజలపై విద్యుత్తు బారాలను విరమించుకోవాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు కోరారు. బుధవారం కలెక్టరేట ఏఒ పూర్ణ చంద్రరావును వివిధ ప్రజా సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అమెరికా ప్రభుత్వమే అదానీ అక్రమాలపై కేసు నమోదు చేసినా కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. అదానీ ఒప్పందాలలో అవినీతి ఉందని బయట పడినా ఇప్పటికీ జిల్లాలోని వ్యాపార సంస్థల్లోను ప్రభుత్వ కార్యాల యాల్లో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, తక్షణమే ఆ చర్యను ఆపాలని కోరారు. భవిష్యత్‌లో ఇళ్లకూ స్మార్ట్ మీటర్లు బిగిస్తారని, ఆ భారం కూడా ప్రజలపైనే వేస్తారన్నారు. కావున ప్రజా వ్యతిరేకంగా ఉన్న స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్, బిసి బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు. పిడిఎం. రాష్ట్ర నాయకులు డి.సుధాకర్, సిపియం ఎంఎల్ ప్రజాపోరు రాష్ట్ర అధ్యక్షులు పాటిబండ్ల కోటేశ్వరరావు, బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కన్వీనర్ సాధు మాల్యాద్రి, వివిధ సంఘాల నాయకులు జి.ఆర్.భగత్‌సింగ్ సిఖ సురేష్. నల్లపు నీలాంబరం పాల్గొన్నారు.

రైతుల నుండి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి

వరిపొలాలను పరిశీలించిన మాజీ మంత్రి అంబటి రాంబాబు, వనమ బాలవజ్రబాబు

రేపు జిల్లా కేంద్రంలో నిరసనను జయప్రదం చేయాలని రైతులకు పిలుపు

ప్రజాశక్తి - మేడికొండూరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల కంట కన్నీరు పెట్టిస్తున్నారని మాజీ మంత్రి వైసీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు అన్నారు. తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు, అంబటి రాంబాబు బుధవారం మేడికొండూరు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో పర్యటించారు. ఈసందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలలో భాగంగా అన్నదాత సుఖీభవ పేరిట ఏటా రూ. 20వేలు ఆర్థిక సహాయం చేస్తానన్న చంద్రబాబు అధికారం చేపట్టి ఆరు నెలలు కావస్తున్న రైతులు ఖాతాలో ఒక్క రూపాయి కూడా జమ చేయలేదని పేర్కొన్నారు. ఈ పథకానికి సంబంధించి రాష్ట్ర బడ్జెట్లో రూ.10,700 కోట్ల కేటాయించాల్సి ఉండగా అసలు ప్రస్తావనే చేయలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వంలో దళారీ వ్యవస్థతో రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. పౌర శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వచ్చి రైతులను కలిసి ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చినా, అధికారులు మాత్రం రైతులు వద్దనుండి ధాన్యం కొనుగోలు చేయకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంన్నారు. రబీ సీజన్ అయిపోయిన రైతులు ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటివరకు ప్రభుత్వం రైతుల వద్ద నుండి 10 శాతం మాత్రమే ధాన్యం కొనుగోలు చేసిందని, దళారీలు రైతుల వద్ద నుండి తక్కువ ధరకు ధాన్యం కొని రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి కుర్చీ కోసం రైతులకు ఆశ చూపి కుర్చీ వచ్చాక రైతులను మోసం చేయడం చంద్రబాబు నైజం అని రాంబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు చేసిన నమ్మక ద్రోహాన్ని ప్రతి రైతు నిలదీయాలని రాంబాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 13న రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈ కార్యక్రమాల్లో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. అనంతరం రైతు ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల జడ్పిటిసి కందుల సిద్దయ్య,మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాళ్లూరి వంశీకష్ణ,వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీ,రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్ వలి,జంగంగుంట్ల పాలెం గ్రామ సర్పంచ్ కళ్లి శ్రీదేవి సాంబిరెడ్డి,కో ఆప్షన్ నెంబర్ చంటి బాజీ,కిషోర్ రెడ్డి,కోటిరెడ్డి,ఉడత ప్రభాకర్,కొటికల దాసు,కొక్కెర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సుస్థిర అభివృద్ధి

ప్రజాశక్తి - క్రోసూరు

క్షేత్ర స్థాయిలో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా గ్రామ పంచాయతీలు పని చేయాలని, అందుకు ప్రభుత్వ శాఖల అధికారుల ఉమ్మడి కృషి ఎంతో అవసరమని క్రోసూరు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. బుధవారం క్రోసూరులోని ఎంపిడిఓ కార్యాలయంలో రెండవ రోజు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.వేల కోట్లు వెచ్చిస్తున్నాయని తెలిపారు. పథకాలకు అర్హులైన వారిని గుర్తించి వారికి ప్రయోజనం చేకూర్చేందుకు గ్రామ పంచాయతీ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. 2030 నాటికి అన్ని స్థానిక ప్రభుత్వాలు సుస్థిర అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో క్రోసూరు సెక్టార్ అంగన్‌వాడీ సూపర్ వైజర్ మాధవి, ఆరోగ్య విస్తరణాది కారిశిఖ శాంసన్, ఏపీవో వెంకటేశ్వరరావు, మేజర్ పంచాయతీ కార్యదర్శి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన జీవనోపాధి కలిగించడమే ధ్యేయం

ప్రజాశక్తి- పెదకూరపాడు

గ్రామాలలో మెరుగైన జీవనోపాధులు కలిగించడమే ధ్యేయంగా శిక్షణా తరగతులు అందిస్తున్నామని పెదకూరపాడు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. బుధవారం పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు, సచివాలయ కార్యదర్శులకు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు.

సత్తెమ్మతల్లిని దర్శించుకున్న కన్నా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్

అచ్చంపేట మండలం మాదిపాడు సమీపంలో వేంచేసియున్న శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మ వారిని సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు, పెద్దలు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్.. కన్నాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి-ఈపూరు

పోరాటాలతోనే మాదిగల హక్కులను సాధించగలమని వినుకొండ నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు కందుకూరి శ్యామ్ మాదిగ అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులో బుధవారం ఎంఆర్‌పీఎస్ మండల నూతన కమిటీ నియామకం ఏర్పడింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎంఆర్‌పీఎస్ బలోపేతం కోసం అందరూ ఐక్యతగా పనిచేయాలన్నారు. మండల గౌరవాధ్యక్షులుగా మాజీ జడ్పీటీసీ సభ్యులు బందెల కన్నయ్య, అధ్యక్షునిగా మందా బెంజిమెన్ మాదిగ, స్టూడెంట్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షునిగా ముప్పాళ్ల ప్రభుదాసు, మహాజన సోషలిస్టు పార్టీ అధ్యక్షునిగా వేల్పుల పేరయ్య, బేడ బుడిగ జంగం మండల అధ్యక్షులుగా ఆరేటి యల్లయ్యను నియమించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు అమతపూడి జోసెఫ్, స్వర్ణ ముసలయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. 'మీ భూమి- మీ హక్కు' పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం రీసర్వే పేరిట ల్యాండ్ మాఫియాకు పాల్పడిందని.. ప్రజలు భూసమస్యలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. నేడు గ్రామ స్థాయిలో భూవివాదాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఇక నుంచి భూసమస్యలపై బాధితులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. ఫ్రీ హోల్డ్, మ్యుటేషన్, 22ఏ, డికెటి, రీ సర్వే, ఇతర రెవెన్యూ సంబంధిత అంశాలపై వినతులు స్వీకరించి బాధితులకు న్యాయం చేయనున్నారని తెలిపారు.

అర్జీల స్వీకరణ

క్రోసూరు: భూసమస్యలున్న రైతులు రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం క్రోసూరు మండలంలోని నాగవరం, గరికపాడు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. రైతుల నుంచి వివిధ సమస్యలపై 25 అర్జీలు స్వీకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీధర్, వీఆర్వో కోటయ్య, గ్రామ సర్వేయర్ గోపి నాయక్, సర్పంచ్ చిరంజీవి రామాంజనేయులు, ఎంపీటీసీ మస్తాన్ వాలి, సయ్యద్ జాన్, ఈఓ సూర్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీధర్

క్రోసూరులో సభల ఉద్దేశం వివరిస్తున్న అధికారులు

రెవెన్యూ సదస్సుకు 10 అర్జీలు

వెల్దుర్తి : బోదిలవీడు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 10 అర్జీలు అందాయి. గ్రామస్థులు వివిధ భూ సమస్యలను తహసీల్దార్ బాషాకు దృష్టికి తీసుకొచ్చి అర్జీలను అందించారు. ఆర్ఐ షేక్ మస్తాన్‌వలి, గ్రామ వీఆర్వో కడియం రాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజలతో మర్యాదగా మెలగాలి

పోలీసు అధికారులకు డీఎస్పీ సూచన

ప్రజాశక్తి - కారంపూడి

వివిధ సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని గురజాల డీఎస్పీ జగదీష్ సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల రక్షణే ధ్యేయంగా విధి నిర్వహణలో పోలీసులు ముందుండాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గ్రామాల్లో గస్తీ పెంచాలని సూచించారు. పలు కేసులు, పెండింగ్‌లో ఉన్న రికార్డులను, లాకప్‌లను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సీఐ శ్రీనివాస్, ఎస్సై వాసులకు ఆదేశించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి.. సీజ్ చేసిన వాహనాలపై ఆరా తీశారు.

కేసుల వివరాలపై ఆరా తీస్తున్న డీఎస్పీ

ఉద్యమనేత సాంబశివరావు మృతి

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

ప్రజా ఉద్యమాల నాయకుడు ఆర్.సాంబశివరావు బుధవారం కన్నుమూశారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తెలవారుజామున మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1942 లో జన్మించిన రామినేని సాంబశివరావు ..కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీలో కొంత కాలం పని చేశారు. అనంతరం బయటకు వచ్చి, వచ్చి విప్లవ పంథాను ఎన్నుకున్నారు. ఆర్.ఎస్.యు, పౌరహక్కుల సంఘాలకు బలమైన మద్దతుదారుడుగా పనిచేశారు. మావోయిస్టు దివంగత అగ్ర నాయకుడు ఆర్‌కె. రమణారెడ్డి, బాలయ్యలు.. పౌరహక్కుల నేతలు బాలగోపాల్, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యంలతో బలమైన సంబంధాలు ఉండేవి. కమ్యూనిస్టు ఉద్యమాలు, కార్మికుల ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. పోలీస్ లాకప్‌లకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేశారు. 80వ దశకంలో విరసం సభలు మాచర్లలో నిర్వహించడంలో కీలకభూమిక పోషించారు. తన సిద్ధాంతాలకు అనుగుణంగా కుమార్తెకు శాంతిప్రియ, కుమారుడికి నక్సల్ కుమార్ అని పేర్లు పెట్టుకున్నారు. ఆయన మరణం పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

పట్టణ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ప్రాంగణంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శిబిరాన్ని నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంబాల అనిల్ కుమార్ తెలిపారు. న్యాయవాదులు, గుమస్తాలు, కోర్టు సిబ్బంది ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-ఈపూరు

ఈ నెల 9,10వ తేదీల్లో ఆర్‌వీఆర్‌అండ్‌జేసీ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన అంతర కళాశాలల వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, సౌత్ జోన్ వాలీబాల్ పోటీలకు ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థులు షేక్ ఉస్మాన్, షేక్ కళాముద్దీన్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరావు బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు డిసెంబర్ చివరి వారంలో యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరిగే దక్షిణ మండల అంతర విశ్వవిద్యాలయాల పోటీలలో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, అధ్యాపకులు ఆర్ బలరాం నాయక్, సిహెచ్ అరవింద్, ఎం.దాస్, కె.వంశీ అభినందించారు.



ఆకతాయిలపై పోలీసుల దృష్టి

ప్రజాశక్తి - వినుకొండ

ఆకతాయిలపై పోలీసులు దృష్టి సారించారు. బుధవారం వినుకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్లో వినుకొండ పట్టణ సీఐ శోభన్ బాబు, ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో కలసి పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు, ఆకతాయిల ఆగడాలపై ఆరా తీశారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఆకతాయిల నుంచి ఎటువంటి ఇబ్బందులూ ఎదురుకాకుండా ఇద్దరు కానిస్టేబుళ్లను బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. అనంతరం ఎన్ఎస్‌పీ కాలువ కట్ట మీద, సీసీ రహదారులపైన ట్రాఫిక్ సమస్యలను పరిశీలించారు. రహదారులపై పార్కింగు చేస్తున్న వాహనదారులకు హెచ్చరించారు.

ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ

14న సాగునీటి సంఘాల ఎన్నికలు

ప్రజాశక్తి-ఈపూరు

ఈనెల 14న సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. మండలంలోని అగ్నిగుండాల, బొగ్గరం, ఈపూరు, ఎ.ముప్పాళ్ల-1, ఎ ముప్పాళ్ల-2 (202), కొండాయపాలెం-203 చిట్టాపురం, కొండాయపాలెం, కొచ్చర్ల, కొండ్రముట్ల -1, కొండ్రముట్ల-3 సాగునీటి సంఘాలకు ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించి అదే రోజు టీసీ సభ్యుల ఎంపిక అనంతరం అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎంపిక ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు.

ప్రారంభానికి సిద్ధమైన రక్తనిధి కేంద్రం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని రెడ్‌క్రాస్ పల్నాడు జిల్లా చైర్మన్, కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కంజుల జగన్మోహనరెడ్డి పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణ సమీపంలోని లింగంగుంట్లలో గల డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రభుత్వ వైద్యశాలలో ఈ నెల 13న రెడ్ క్రాస్ రక్త నిధి కేంద్రం ప్రారంభోత్సవం కానున్నట్లు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు, ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

ప్రజాశక్తి-పెదకూరపాడు

అన్నం పరబ్రహ్మ స్వరూపమని.. అన్నార్తుల ఆకలి తీర్చడమే జనచైతన్య సమితి లక్ష్యమని జనచైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు అన్నారు. ఓ ఫంక్షన్‌లో మిగిలిపోయిన ఆహారాన్ని సంస్థ ప్రతినిధులు సేకరించి, తాళ్లూరు శాంతికాలనీలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాడికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ లియాఖత్ ఆలీ మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జన చైతన్య సమితి బంద ప్రతినిధులు కొర్రపాటి వెంకటేశ్వర్లు, మాదాసు శ్రీనివాసరావు, దాసరి విజయ్, బెన్ని బాబు పాల్గొన్నారు.

14న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- తెనాలి రూరల్

తెనాలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల14న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. తెనాలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు ధర్మరాజులు చెన్నకేశవులు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది.

నేడు మంగళగిరిలో నిమ్మగడ్డ వర్ధంతి సభ

ప్రజాశక్తి - మంగళగిరి

సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు, మంగళగిరి మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు 16వ వర్ధంతి సభ గురువారం సాయంత్రం మంగళగిరి పట్టణంలోని మండల పరిషత్తు గేటు, నిమ్మగడ్డ విగ్రహం వద్ద నిర్వహించనున్నట్లు పార్టీ మంగళగిరి పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌లాల్ తెలిపారు. ఈ సభలో సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.ఎస్.చెంగయ్య, సీనియర్ నాయకులు జెవి రాఘవులు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలోని సైమన్ మెమోరియల్ ప్రేయర్ హాలు ప్రాంగణంలో శాంతిదూత మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ఉత్సవాలతో పాటు, నూతన సంవత్సరానికి స్వాగతారా ధనలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా ఏపీ పద్మశాలి డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, కార్పొరేషన్ అదనపు కమిషనర్ కె.శకుంతల, ప్రొఫెసర్ కొడాలి విజయకుమార్, రెవరెండ్ జోసెఫ్ కొడమల, రెవరెండ్ కే రవికుమార్ తదితరులు హాజరయ్యారు. లిటిల్ సిస్టర్స్ ఆఫ్ ది పూర్ సంస్థ నిర్వాహకులు సిస్టర్ జుడిత్ , సిస్టర్ మరియ విక్టోరియా జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సైమన్ మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి నోవా సైమన్, మినిస్ట్రీస్ అధ్యక్షులు రూఫన్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక 31వ వార్డులో నెలకొన్న మురుగు సమస్యలను తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక బుధవారం పరిశీలించారు. పారిశుధ్య పనులపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తీయించారు. పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ లక్ష్మీపతిరావు, మున్సిపల్ ఆరోగ్య అధికారి కె.హెలెన్ నిర్మల, అసిస్టెంట్ ఇంజినీర్ బి.సునీల్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి సాంబశివరావు పాల్గొన్నారు.

బాల్యం.. బతుకు 'వల'లో చిక్కి!

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

నేటి బాలలే రేపటి పౌరులు వంటి సూక్తులు నాలుగు గోడల మధ్య చెప్పుకోవడానికి మాత్రమే పనికొస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో ఆచరణలోకి రావడం లేదు. ప్రభుత్వాలు ఎన్ని మారినా.. నేటికీ చాలామంది చిన్నారులకు విద్య మిథ్యగానే మిగిలిపోతోంది. ప్రత్తిపాడు డంపింగ్ యార్డు వద్ద కుంటలో చేపలు పట్టుకుంటున్న ఈ చిన్నారులే ఇందుకు సజీవ సాక్ష్యం. సాధారణంగా ఆరేళ్ల వయసు పిల్లలు.. బడికి వెళుతూ ఉంటారు. ఇక్కడ పిల్లలకు పాఠశాల అంటే తెలుసు.. విద్య అంటే తెలియదు. వారికి కనీసం ఆధార్ వంటి గుర్తింపు కార్డులూ లేవు. వారి తల్లిదండ్రులు ఉపాధి రీత్యా పనులకు వెళ్లగా.. ఇద్దరు బాలురు, మరో ఇద్దరు బాలికలు చేపల వల తీసుకొని ప్రత్తిపాడులోని డంపింగ్ యార్డు వద్ద కుంటలో చేపలు పడుతున్న దృశ్యం అధికారుల తీరు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రత్తిపాడు ఎంఈవో కార్యాలయానికి కూత వేటు దూరంలోనే ఇదంతా.. బడి బయట విద్యార్థులను గుర్తించాలని జిల్లా స్థాయి అధికారులు ఎంత మొత్తుకుంటున్నా.. తూతూమంత్ర పర్యవేక్షణ చేసి పబ్బం గడుపుకొంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బడి బయట పిల్లలను గుర్తించే బాధ్యత.. మహిళా సంరక్షణ అధికారులు, విద్యాశాఖ అధికారులున్నప్పటికీ వారి నిర్లక్ష్యం కారణంగానే పిల్లలు చదువుకు దూరమవుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలో ఇటువంటి చిన్నారులు కోకొల్లలు. భిక్షాటనలోనూ, కార్మికులుగానూ మగ్గిపోతున్నారు.

ఉపాధ్యాయులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలోని వీఐటీ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ అడ్వాన్స్ సైన్స్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలోని ఎనిమిది మండలాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 47 మంది ఉపాధ్యాయులకు ఒకరోజు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రధానంగా గణిత సమస్యలను పరిష్కరించడానికి, సాఫ్ట్‌వేర్ వినియోగ సామర్థ్యాలను పెంపొందించడంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. భౌతిక, రసాయన శాస్త్రంలో ప్రయోగాత్మక రూపకల్పన నైపుణ్యాలను మెరుగుపరచడానికి కార్యక్రమం ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి మాట్లాడుతూ, నూతన విద్యావిధానానికి అనుగుణంగా విద్యార్థులకు విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కూడా

తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని తెలిపారు. అందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని చెప్పారు. రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ.. వీఐటీ విశ్వవిద్యాలయం సామాజిక బాధ్యతలో భాగంగా ఇటువంటి అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్, ఎం.ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ప్రత్యేక విద్యాబోధన : ఎంఈవో

ప్రజాశక్తి-మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరు విద్యా వనరుల కార్యాలయ సమీపంలోని భవిత స్కూల్‌లో బుధవారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు బొడ్డు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఈఓ-2 అలీమ్ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రత్యేక విద్యాబోధనలతోపాటు, వారికి ఉన్న సమస్యలను బట్టి మంచి సౌకర్యాలు అందుబాటులో ఉండటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.ఏసురత్నం, మండల ప్రత్యేక ఉపాధ్యాయులు, శిరిగిరి గణేష్ , జోజప్ప , బైరాగి, గోపి, కొండలరావు తల్లిదండ్రులు

మాట్లాడుతున్న ఎంఈవో-2 అలీమ్

శివశంకర్‌కు సేవాభూషణ్ పురస్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ప్రముఖ సమాజ సేవకులు తన్నీరు శివశంకర్‌కు సేవాభూషణ్ పురస్కారం అభినందనీయమని కాకినాడ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు కర్రి భామిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడలో నిర్వహించిన కార్యక్రమంలో తెనాలికి చెందిన సంఘసేవకులు శివశంకర్‌కు సేవాభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, నేషనల్ ప్రెసిడెంట్ బొడ్డపాటి దాసు, ప్రధాన కార్యదర్శి జి.స్వామి నాయుడు, జిల్లా కన్వీనర్ గూటూరు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షురాలు తబిత రత్నకుమారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందుకుంటున్న శివశంకర్

రావిపాడు రెవెన్యూ సదస్సులో ఏడు అర్జీలు

ప్రజాశక్తి- పెదనందిపాడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సదస్సులను బుధవారం పెదనందిపాడు మండలం రావిపాడులో నిర్వహించినట్లు మండల డిప్యూటీ తహసీల్దార్ షేక్ కరిముల్లా తెలిపారు. భూసమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సదస్సులను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ సాహితీ మోహన్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ ముప్పా శ్రీదేవి, దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - పెదనందిపాడు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశంపై మండలంలోని సర్పంచులు, కార్యదర్శులకు పెదనందిపాడు ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న మొదటిబ్యాచ్ శిక్షణ బుధవారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాపట్ల ఈటీసీ ప్రిన్సిపాల్ డి.వెంకటరావు మాట్లాడుతూ పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగిన గ్రామాలు, ఆరోగ్యవంతమైన సమాజం కోసం వివరించారు. ఎంపీడీవో గుంటి లక్ష్మీదేవి, ఈఓపిఆర్డీ వరాధిని, సూపరింటెండెంట్ కె.స్వామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నాగయ్య, పృథ్వీకుమార్, పెదనందిపాడు సర్పంచ్ దాసరి పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి- ప్రత్తిపాడు

రెవెన్యూ సదస్సులకు అయిదు అర్జీలు వచ్చినట్లు ప్రత్తిపాడు మండల తహసీల్దార్ జి.కరుణకుమార్ తెలిపారు. బుధవారం ప్రత్తిపాడు మండలంలోని తిమ్మాపురం గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వివిధ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందించారు. దీర్ఘకాలికంగా గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దారు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు మండల ప్రత్యేక అధికారి గాయత్రి దేవి, డిప్యూటీ తహసీల్దార్ ధర్మ తేజ, ఎండోమెంట్ ఈ ఓ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ జి.రామకృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారి రత్న మయి, గ్రామ సర్వేయర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక బృందాలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో వీధి కుక్కల నియంత్రణ కోసం నియోజకవర్గాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వీధి కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్లు, యాంటీ ర్యాబీస్ వ్యాక్సినేషన్ ఏటుకూరు రోడ్డులో ప్రత్యేకంగా స్నేహ్ వెల్ఫేర్ సొసైటీ చేస్తుందన్నారు. నగర పరిధిలో సమర్థవంతంగా వీధి కుక్కల నియంత్రణ జరిగేందుకు గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు ప్రత్యేకంగా వాహనాలు, సూపర్వైజర్, డాగ్ క్యాచర్లకు విధులు కేటాయించామని తెలిపారు. వీధి కుక్కలను పట్టుకోవడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు ప్రతిరోజు ప్రజారోగ్య అధికారులు అందించే షెడ్యూల్, పిజిఆర్ఎస్, 103 సెల్ ఫిర్యాదుల మేరకు విధులు నిర్వహించాలన్నారు. ఆయా వార్డులకు ఈ బృందాలు వచ్చినప్పుడు స్థానిక శానిటేషన్ కార్యదర్శి, ఇనస్పెక్టర్లు తమ ప్రాంతంలో పట్టుకున్న కుక్కలు, తిరిగి వదిలిన వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని ఆదేశించారు.

జాతీయస్థాయి స్కేటింగ్‌లో కోటేశ్వర్‌కు కాంస్య పతకం

ప్రజాశక్తి -తాడేపల్లి

జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఉండవల్లికి చెందిన సందు కోటేశ్వర్ కాంస్య పతకం సాధించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. ఈనెల ఐదో తేదీ నుండి 15వ తేదీ వరకు జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీలు కర్ణాటకలోని మైసూర్ లో జరిగాయి. ఈ పోటీల్లో 9-11 విభాగంలో రాష్ట్రం నుండి పాల్గొని రింక్-2లో కాంస్య పతకం సాధించాడు. కాకినాడలో గత నవంబర్ 6న జరిగిన రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో, అండర్ 11 విభాగంలో ఉమ్మడి కష్ణా జిల్లాకు ప్రాతినిధ్యం వహించి మూడు బంగారు పత కాలు సాధించి చరిత్ర సష్టించారు. రాష్ట్రస్థాయి నుండి జాతీయ స్థాయికి ఎంపికై మొదటిసారి తన సత్తా సాటిన సందు కోటేశ్వర్ కు పలువురు ఉండవల్లి వాసులు తమ అభినందనలు తెలిపారు.

కళ్లం కాలేజి అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రొఫెసర్ వీరకుమార్‌ను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ తదితరులు

కళ్ళం హరనాధరెడ్డి ఇంజినీరింగ్ కాలేజి అసోసియేట్ ప్రొఫెసర్ వీరకుమార్ జెట్టి ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి తెలిపారు. వీరకుమార్ 'ఏ స్టడీ ఆన్‌ది ఇంపాక్ట్ ఆఫ్ మొబైల్ హ్యాండ్సెట్ అట్రిబ్యూట్స్ ఆన్ కస్టమర్ సాటిస్ ఫ్యాక్షన్ టు డిరైవ్ బ్రాండ్ లాయల్టీ (స్పెషల్ స్టడీ ఆన్ చెన్నై అండ్ బెంగళూరు సిటీస్) అంశంపై పరిశోధన చేశారని, ఆయనకు ఏఎన్‌యు ప్రొఫెసర్ డాక్టర్ కె.లలిత గైడ్‌గా వ్యవహరించారని ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా కళాశాల బిజినెస్ మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఇర్షాద్, కెరీర్ గైడెన్స్ విభాగాధిపతి డాక్టర్ పి.ఎల్.మాధవరావు డాక్టర్ వీరకుమార్ జెట్టిని అభినందించారు.

డాక్టర్ శ్రీదేవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

శ్వాసకోశ సమస్యలపై చలపతిలో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

శ్వాసకోశ సంబంధిత వ్యాధులు నేడు ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యమైన ఆరోగ్య సమస్యగా మారాయని గుంటూరు, కిమ్స్ శిఖర హాస్పిటల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ డిఎస్ఎస్‌వి శ్రీదేవి అన్నారు. చలపతి ఫార్మసీ కాలేజిలో బుధవారం ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం వారు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరైన డాక్టర్ శ్రీదేవి విద్యార్థులకు శ్వాసకోశ సంబంధిత సమస్యలు, వాటి నివారణ, జాగ్రత్తల గురించి వివరించారు. శ్వాసకోశ సమస్యలు ఆరోగ్యాన్ని ప్రభావితం చేయటమే కాకుండా మన జీవితానికి ప్రధాన సమస్యలను కలిగించే పరిస్థితులలో ఒకటిగా పరిగణిమిస్తుందన్నారు. ఆస్తమా, సీఓపీడీ, న్యూమోనియా, ట్యూబర్‌కులోసిస్ వంటి సమస్యలు వైద్య చికిత్సతో నయం చేయవచ్చన్నారు. ఈ సమస్యలు రోగుల రోజువారీ జీవనశైలిని ప్రభావితం చేయడమే కాకుండా, అనేక సందర్భాల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయన్నారు. వివిధ చికిత్సా పద్ధతులతో రోగం తీవ్రతను తగ్గించడమే కాకుండా, జీవిత నాణ్యతను మెరుగుపరచడంలో సహాయ పడతా యన్నారు. అయితే, ప్రతి సమస్యకు తగిన చికిత్సా విధానాలు వైద్య నిపుణుల పర్యవేక్షణలో చేయించుకోవడం అవసరమని పేర్కొన్నారు. ప్రాథమిక లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సలహా తీసుకుంటే, సమస్యను వేగంగా నియంత్రించవచ్చన్నారు. శ్వాసకోశ సమస్యల నివారణకు ఆరోగ్యకరమైన జీవనశైలి, మంచి ఆహారపుఅలవాట్లు, పొగాకు వంటి హానికరమైన అలవాట్లకు దూరంగా ఉండడం అవసరం అన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామారావు డాక్టర్ శ్రీదేవిని సన్మానించారు.

ఎఐ ద్వారా ఫార్మసీ రంగంలో విస్తృత పరిశోధన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఎఎన్‌యు ఫార్మసీ కళాశాలలో ప్రారంభమైన రెండ్రోజులు జాతీయ సదస్సులో వక్తలు

సదస్సులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విసి, తదితరులు

కృత్రిమ మేధతో ఆధునిక పరిశోధన రంగం వేగవంతం కావాలని మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లోని మంగళయూటన్ విసి ఆచార్య ఆర్ఎస్ సాంబశివరావు ఆయన పిలుపునిచ్చారు. బుధవారం ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని ఫార్మసీ కళాశాలలో మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్మెంట్ అనే అంశంపై రెండు రోజులు జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ముఖ్య వక్తగా ఆచార్య సాంబశివరావు మాట్లాడారు. జన్యు క్రమ లోపాల వల్ల కలిగే రుగ్మతలను ఆధునిక పద్ధతుల ద్వారా చికిత్స చేయవచ్చునని పేర్కొన్నారు. అందుకు ఫార్మాకో జేనోమిక్స్ ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. తద్వారా ఔషధాల దుష్ప్రభావాలను తగ్గించి సమర్థవంతమైన చికిత్సలు అందించవచ్చునని వివరించారు. బయో ఇన్ఫర్మేటిక్స్ ఫార్మకోజి నోమిక్స్ కలిసి వ్యక్తిగత వైద్యాన్ని ప్రోత్సహిం చేందుకు కీలకమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఫార్మసిస్టులు ఔషధాల తయారీలో ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉంటున్నారని కొనియాడారు. తద్వారా భారత దేశ కీర్తి నలుదిశలా వ్యాప్తి చెందుతుందని ఆకాంక్షించారు. భారత ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఐ. బాలకృష్ణ మాట్లాడుతూ సాంకేతికత వల్ల కలుగుతున్న దుష్ప్రభావాలను, ప్రయోజనాలు వివరించారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి సమాజాభివృద్ధికి తోడ్పడే ఆవిష్కరణలు చేయవచ్చునని తెలిపారు. అందులో భాగంగా మైక్రో డ్రోన్, మస్కిటో స్ప్రై యంత్రాలు మైక్రో చిప్ వంటి సాధనాలు శరీర రుగ్మతలను గుర్తించడంలో వినియోగిస్తామని పేర్కొన్నారు. బెంగళూరు లోని ఆల్ అమీన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎండి సలాహుద్దీన్ డీప్ లెర్నింగ్ మిషన్ లెర్నింగ్ ఆల్గారిజమ్ ఉపయోగించి ఔషధ లక్ష్యాలను గుర్తించడం దానికి అనుగుణంగా ఔషధాలను కనుగొనడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ముఖ్యమైన భాగంగా మారిందని పేర్కొన్నారు. ఔషధాల అభివృద్ధి ప్రక్రియ వేగవంతమైందని వివరించారు. వర్సిటీ వీసి ఆచార్య కే గంగాధరరావు మాట్లాడుతు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మారుతున్న ఆహార అలవాట్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. వాటిని ప్రజలకు తెలియపరచడంలో ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషించాలని గుర్తు చేశారు. నేడు అనేక రకాల రోగాలు విస్తృతంగా వృద్ధి చెందుతున్నాయని వాటిని నియంత్రించడంలో మెరుగైన ఔషధాలను తయారు చేయాలని సూచించారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి. రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాల యాలు అనుబంధ కళాశాల నుంచి 800 మంది విద్యార్థులు సదస్సులో పాల్గొన్నారన్నారు. కేసిరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసోటికల్ సైన్సెస్ కో స్పాన్సర్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఏ .ప్రమీల రాణి అధ్యక్షత వహించారు. సదస్సులో రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, కో కన్వీనర్ డాక్టర్ అన్నపూర్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కే. సుజన, కోశాధికారి డాక్టర్ కే ఈ ప్రవల్లిక, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కే. మస్తానమ్మ, కే. విజయ్ కిషోర్, తెనాలిలోని ఏఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె .వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫార్మసిరంగానికి సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు.

హాజరైన విద్యార్థులు

సమ్మెటివ్ పరీక్షలను పరిశీలించిన డిఇఒ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక బుధవారం గుంటూరు నగరంలోని స్టాల్ బాలికల ఉన్నత పాఠశాల, నగరంపాలెం, పట్టాభిపురంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలను సందర్శించి, పాఠశాలల్లో జరుగుతున్న సమ్మెటివ్ అసెస్‌మెంట్ టర్మ్-1 పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ పరీక్షలను సమర్థవంతంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని, పరీక్షలు అయిపోయిన అనంతరం అన్ని సబ్జెక్టుల ప్రశ్నలకు జవాబులు పూర్తిగా చదివించాలని, ఏరోజు పరీక్ష పేపర్లు ఆరోజు ఒక గంట ముందు సంబంధిత కేంద్రాల నుండి తెప్పించుకొని నిర్వహించాలని పలు హెచ్ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. ఎవరూ అశ్రద్ధ చేయకుండా జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు.

పదిమంది మహిళల్లో ఒకరికి పిసిఒడి

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ భారతి ప్రసన్న, తదితరులు

పాలి సిస్టిక్ ఒవేరియన్ డిసీస్ (పిసిఒడి)తో ఇబ్బంది పడుతున్న వారు రోజురోజుకు పెరుగుతున్నారని, ఆశ్చర్యంగా బాధితుల్లో 70 శాతం మందికి ఈ వ్యాధి ఉన్నట్టే తెలియదని ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ భారతి ప్రసన్న అన్నారు. బుధవారం స్థానిక శారద విద్యానికేతన్‌లో ప్రకృతి యోగా సంజీవని ట్రస్ట్, చైతన్య వాహిని సొసైటీ, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ భారతి ప్రసన్న మాట్లాడుతూ పిసిఒడి లక్షణాలు, అందుకు గల కారణాలు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. పిసిఒడిని అశ్రద్ధ చేస్తే సంతానలేమి, షుగర్, బిపి, క్యాన్సర్ లాంటి అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. షుగరు, ఉప్పు, మైదా లాంటి పదార్థాలను తగ్గించుకుంటూ కూరగాయలు పండ్లతో కూడిన సమతుల్యమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆ తర్వాత విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పిసిఒడి సమస్యలు తలెత్తకుండా నివారించే యోగాసనాలను కోఆర్డినేటర్ పి రామరత్తయ్య విద్యార్థినులకు వివరించారు. ఆర్థిక ఇబ్బందులు గల విద్యార్థినులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున వైద్యులు సూచించిన మందులను ఉచితంగా అందజేయనున్నట్టు మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి ధనుంజయ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ పావులూరి రమేష్ శారద విద్యానికేతన్ ఈవో టి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ పి.కోటిరత్నం, మానవత సభ్యులు పాల్గొన్నారు.